

సబ్సిడీ పథకాలకు మంగళం!

వ్యవసాయ శాఖ ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న సబ్సిడీ పథకాలు అటకెక్కాయి. ఏళ్లుగా నిధులు నిలిచిపోయాయి. 10లో▸



మోసగించిన హెచ్‌ఎండీఏ!

హెచ్‌ఎండీఏ లే అవుట్ అన్న నమ్మకంతో రూ.కోట్లు పోసి ప్లాట్లను కొంటే మోసం చేసిందని బాధితులు వాపోయారు. 10లో▸



ఎక్సైజ్ శాఖ విస్తృత దాడులు

కడ్తాల్, మాడ్గుల్, ఆమనగల్లు, తలకొండపల్లి మండలాల పరిధిలో ఎక్సైజ్ శాఖ విస్తృతంగా దాడులు నిర్వహించింది. 10లో▸

న్యూస్‌రీల్

రేషన్ బియ్యం పట్టివేత



పోలీసులు స్వాధీనం చేసుకున్న బియ్యం

ఇబ్రహీంపట్నం రూరల్: ప్రజలకు అందజేసే రేషన్ బియ్యాన్ని అక్రమంగా దాచారన్న సమాచారంతో ఎస్‌ఓటీ పోలీసులు గోదాంలో సోదాలు చేశారు. ఈ సోదాల్లో భారీగా నిల్వ ఉంచిన బియ్యం స్వాధీనం చేసుకున్నారు. ఈ సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇబ్రహీంపట్నం సీఐ సత్యనారాయణ కథనం ప్రకారం.. ఆదిబట్ల మున్సిపాలిటీ మంగళ్‌పల్లి సమీపంలోని పాడుబడ్డ రైస్‌మిల్లులో భారీగా రేషన్‌బియ్యం నిల్వ ఉంచారన్న సమాచారంతో ఆదివారం పోలీసులు సోదాలు చేశారు. ఈ సోదాల్లో 20 టన్నుల బియ్యం స్వాధీనం చేసుకున్నారు. భువనగిరికి చెందిన పులుసోత్తు నరేష్‌ను అరెస్టు చేశారు. ప్రేమ్ అనే మరో వ్యక్తి పరారీలో ఉన్నట్లు తెలిపారు. బియ్యాన్ని ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్‌కు తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

అతివేగం.. తీసింది ప్రాణం

- విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ద్విచక్ర వాహనం
- బీటెక్ విద్యార్థి దుర్మరణం, మరొకరికి గాయాలు



వంశీకృష్ణ (ఫైల్)

మీర్‌పేట: వేగంగా వెళ్తున్న ద్విచక్ర వాహనం అదుపుతప్పి విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టడంతో బీటెక్ విద్యార్థి అక్కడికక్కడే మృతి చెందగా, మరో విద్యార్థి గాయపడ్డ సంఘటన మీర్‌పేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. స్థానికులు, ఇన్‌స్పెక్టర్ నాగరాజు తెలిపిన వివరాల ప్రకారం. జగిత్యాల జిల్లా మెట్‌పల్లి మండల కేంద్రానికి చెందిన బాసాని రవి కుమారుడు వంశీకృష్ణ (20) మీర్‌పేటలోని టీకేఆర్ కళాశాలలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతూ తిరుమలహిల్స్ కాలనీలో స్నేహితులతో కలిసి ఉంటున్నాడు. శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత 2.30 గంటలకు దిల్‌సుఖ్‌నగర్‌లో ఉండే స్నేహితుడు బాలాజీతో కలిసి ద్విచక్ర వాహనంపై మీర్‌పేట నుంచి మందమల్లమ్మ వైపు వెళ్తున్నాడు. జిల్లెలగూడ పాత గ్రామ పంచాయతీ కార్యాలయం వద్దకు రాగానే బైక్ వేగాన్ని కంట్రోల్ చేయలేక రోడ్డుకు అవతలి వైపు ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టాడు. దీంతో వంశీకృష్ణకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం నిమిత్తం వంశీకృష్ణ మృతదేహాన్ని తరలించి, బైకుపై వెనుక కూర్చున్న బాలాజీకి గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. ప్రమాదంలో ద్విచక్ర వాహనం ముందు భాగం పూర్తిగా ధ్వంసమైందని, అతివేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు తెలిపారు.

‘విస్తరణ’.. నత్తనడకన

44వ జాతీయ రహదారి విస్తరణకు రూ.500 కోట్లు

- శంషాబాద్ నుంచి కొత్తూరు వరకు ఆరు లేన్లు
- నెమ్మదిగా కొనసాగుతున్న పనులు
- తరచూ తప్పని ట్రాఫిక్ తిప్పలు
- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు

షాద్‌నగర్: జాతీయ రహదారిపై ప్రయాణం మరింత సాఫీగా సాగేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ట్రాఫిక్ సమస్య, వాహనాల రద్దీని నియంత్రించి ప్రయాణికులకు మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో రహదారి విస్తరణ పనులు చేపట్టారు. రూ.500 కోట్లతో శంషాబాద్ నుంచి కొత్తూరు వరకు చేపట్టిన 44వ జాతీయ రహదారి విస్తరణ పనులు నత్తనడకన సాగుతున్నాయి.

వాహనాలతో నిత్యం రద్దీ

శంషాబాద్ నుంచి కొత్తూరు మీదుగా 44వ జాతీయ రహదారి ప్రస్తుతం నాలుగు లేన్లుగా ఉంది. శంషాబాద్‌లో అంతర్జాతీయ విమానాశ్రమం ఏర్పాటైన తర్వాత ఈ రహదారిపై వాహనాల రాకపోకలు అధికమయ్యాయి. హైదరాబాద్ నుంచి విమానాశ్రయానికి.. ఆంధ్రప్రదేశ్, కర్ణాటక రాష్ట్రాలకు ఇక్కడి నుంచే రాకపోకలు సాగిస్తుంటారు.



కొత్తూరు శివారులో కొనసాగుతున్న జాతీయ రహదారి విస్తరణ పనులు

ప్రతి రోజు వేల సంఖ్యలో వాహనాలు వచ్చివెళ్తుండడంతో ఈ రహదారి ఎప్పుడూ రద్దీగా ఉంటుంది. వాహనాల రద్దీని నియంత్రించి ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు శంషాబాద్ సమీపంలోని తొండుపల్లి నుంచి షాద్‌నగర్ నియోజకవర్గం కొత్తూరు వై జంక్షన్ వరకు ఉన్న నాలుగు లేన్ల జాతీయ రహదారిని ఆరు లేన్లుగా మార్చేందుకు నేషనల్ హైవే అథారిటీ ఆఫ్ ఇండియా రూ.500కోట్లు మంజూరు చేసింది.

45 మీటర్ల వెడల్పుతో..

ప్రస్తుతం రహదారి మధ్యలో డివైడర్ నుంచి అటు 22.5 మీటర్లు, ఇటు 22.5 మీటర్ల రహదారి నిర్మిస్తున్నారు. రహదారి చివరన సర్వీసు రోడ్డుతో పాటు మురుగు నీటి కాల్వలు, బస్ షెల్టర్లు, తాగునీటి వసతి, ఎస్‌ఓఎస్ ఫోన్ల వంటి సౌకర్యాలు కల్పించనున్నారు. 12 కిలోమీటర్ల రహదారిలో ఐదు భారీ బ్రిడ్జిలు, నాలుగు చిన్న బ్రిడ్జిలను నిర్మిస్తున్నారు.

ఆగుతూసాగుతూ పనులు

సుమారు రెండేళ్ల క్రితం ప్రారంభమైన రహదారి విస్తరణ పనులు నత్తనడకన కొనసాగుతున్నాయి. తరచూ ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతుండడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. రోడ్డు ఇరుగ్గా ఉన్న ప్రాంతాల్లో వాహనాల రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. ముఖ్యంగా సాయంత్రం వేళ ఈ రహదారిపై భారీగా ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నమవుతున్నాయి. కల్వర్టులు, చిన్న చిన్న బ్రిడ్జిలు, మురుగు కాల్వలు, సర్వీసు రోడ్డు తదితర పనులు నెమ్మదిగా సాగుతున్నాయి. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు.



జాతీయ రహదారిపై నిలిచిపోయిన వాహనాలు (ఫైల్)

త్వరగా పూర్తి చేయాలి



జాతీయ రహదారి విస్తరణ పనులు త్వరగా పూర్తి చేయాలి. పనులు నత్తనడకన సాగుతుండటంతో వాహనదారులు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి సత్వరం పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలి.

– నర్సింహ, వాహనదారుడు, షాద్‌నగర్

తరచూ ట్రాఫిక్ ఇక్కట్లు



శంషాబాద్ నుంచి కొత్తూరు వరకు తరచూ ట్రాఫిక్ జాం అవుతోంది. అత్యవసర పనుల మీద ఈ రహదారి గుండా వెళ్లాలంటే ఇబ్బందులు తప్పడం లేదు. గంటల తరబడి రోడ్డుపై వాహనాలు ఆగిపోతున్నాయి.

– శ్రీకాంత్, వాహనదారుడు, షాద్‌నగర్



శిక్షణ తరగతుల్లో మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర నాయకుడు స్కైలాబ్‌బాబు

ప్రభుత్వ రంగ సంస్థలు ప్రైవేటు పరం

సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు స్కైలాబ్‌బాబు

ఇబ్రహీంపట్నం రూరల్: ఎన్డీయే పాలనలో ప్రభుత్వ రంగ సంస్థలను పూర్తిగా పట్టించుకోవడం లేదని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు టి.స్కైలాబ్‌బాబు విమర్శించారు. రెండు రోజులుగా ఇబ్రహీంపట్నంలో కొనసాగుతున్న పార్టీ ఇబ్రహీంపట్నం మండల రాజకీయ శిక్షణ తరగతులు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా స్కైలాబ్‌బాబు మాట్లాడుతూ.. కేంద్రంలో మూడోసారి అధికారం చేపట్టిన బీజేపీ సారథ్యంలో మంచిర్యాల జిల్లా శ్రావణపల్లి బొగ్గు గనులను ప్రైవేటుపరం చేయాలని చూస్తోందని అన్నారు. అధికారం చేపట్టిన కొద్ది రోజుల్లోనే రూ.60 లక్షల కోట్ల ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరం చేసిందని ఆరోపించారు. ఇంటి స్థలం కోసం పేదోడు గుడిసెలు వేస్తే కేసులు పెడుతున్న మోదీ ప్రభుత్వం సంపన్న వర్గాలకు వేలాది ఎకరాలు కట్టబెడుతోందని ధ్వజమెత్తారు. కేంద్ర మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన కిషన్‌రెడ్డి సారథ్యంలో బొగ్గుగనులు ప్రైవేటు పరం చేసేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రైవేటు పరం చేయాలని చూస్తే అప్పుడు వ్యతిరేకించిన బీజేపీ నేడు ఎందుకు మౌనం దాల్చిందో చెప్పాలన్నారు. ఈ బొగ్గు నిక్షేపాల్లో 50వేల మంది ఉద్యోగులు, 26వేల మంది కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో ఉపాధి పొందుతున్నట్టు చెప్పారు. ప్రస్తుతం కేంద్రం పబ్లిక్ సెక్టార్ అనే మాట లేకుండా చేస్తోందని దుయ్యబట్టారు. దేశంలో మతోన్మాదం పెరిగిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సామేలు, యాదయ్య, ఇబ్రహీంపట్నం మండల కార్యదర్శి సీహెచ్ జంగయ్య, నాయకులు పి.జగన్, గణేశ్, బుగ్గరాములు, లింగస్వామి, రామకృష్ణారెడ్డి, వెంకటేశ్, నర్సింహ, చెరుకూరి నర్సింహ పాల్గొన్నారు.

‘స్థానిక’ సమరం ఎప్పుడో?

- ముగిసిన మండల, జిల్లా పరిషత్‌ల పదవీకాలం
- ప్రారంభమైన ప్రత్యేకాధికారుల పాలన
- ఎన్నికల కోసం ఆశావహుల ఎదురుతెన్నులు
- బరిలో దిగేందుకు నేతల ఉత్సాహం



ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయం

ఆమనగల్లు: స్థానిక సంస్థల ఎన్నికలపై ఆశావహులు ఆసక్తితో ఎదురుచూస్తున్నారు. పంచాయతీ పాలకవర్గాల పదవీకాలం జనవరిలో పూర్తి కాగా ఈ నెల 4తో మండల పరిషత్, జిల్లా పరిషత్‌ల పదవీకాలం కూడా పూర్తయింది. ఆయా పాలకవర్గాల పదవీకాలం పూర్తికాకముందే ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను ప్రారంభించి పూర్తి చేయాల్సి ఉన్నా ఎన్నికల నిర్వహణపై ఇంకా దృష్టి సారించలేదు. ఇప్పటికే గ్రామ పంచాయతీలకు, మండల పరిషత్‌లకు ప్రత్యేకాధికారులను నియమించింది.

ప్రారంభంకాని ప్రక్రియ

గ్రామ పంచాయతీలు, మండల పరిషత్‌లు, జిల్లా పరిషత్‌ల ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం ఇంకా సన్నాహాలు ప్రారంభించలేదు. పదవీకాలం పూర్తి కావడంతో ప్రత్యేకాధికారులను నియమించి ఎన్నికలను వాయిదా వేసింది. స్థానిక ఎన్నికల నిర్వహణను చేపట్టాల్సి ఉన్నప్పటికీ కాంగ్రెస్‌పార్టీ రాష్ట్రంలో అధికారంలోకి రావడం.. అంతలోనే ఎమ్మెల్సీ, లోక్‌సభ ఎన్నికల షెడ్యూల్ వెలువడడంతో స్థానిక సంస్థల ఎన్నికలను వాయిదా వేసింది. లోక్‌సభ ఎన్నికల అనంతరం ఎన్నికలు నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించినప్పటికీ వివిధ కారణాలతో ఆలస్యం అవుతోంది. స్థానిక సంస్థల ఎన్నికలపై స్పష్టత లేకపోవడంతో నిర్వహణకు అడుగులు పడటం లేదు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు బీసీలకు రిజర్వేషన్ల పెంపు చేస్తామని కాంగ్రెస్ ప్రకటించింది. అలాగే కులగణన చేపడతామని చెప్పినప్పటికీ ఇంకా దీనిపై స్పష్టత రాలేదు. రిజర్వేషన్ల పెంపు, బీసీ కులగణనతో పాటు స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ, ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో మార్పులు జరిగే అవకాశం ఉంది. దీనిని బట్టి చూస్తే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణ ఇప్పట్లో జరిగే అవకాశం కనిపించడం లేదు.

పోటీకి నాయకుల ఏర్పాట్లు

స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయడానికి ఆశావహులు ఉత్సాహం చూపుతున్నారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జెడ్పీటీసీలుగా పోటీ చేయడానికి వివిధ పార్టీల్లోని నాయకులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పార్టీ అభ్యర్థుల గెలుపుకోసం కృషి చేసిన మండల, గ్రామస్థాయి నాయకులు స్థానిక సంస్థల్లో పోటీ చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్‌పార్టీ అధికారంలోకి రావడంతో ఆ పార్టీ నాయకులు ఎన్నికలపై ఆసక్తితో ఉన్నారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీల ఎన్నికలకు పార్టీ గుర్తుపై ఎన్నికలు నిర్వహించనుండటంతో ఆయా పార్టీల నుంచి పోటీ చేయడానికి నేతలు సిద్ధమవుతున్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్‌ఎస్, బీజేపీ నేతల మధ్య పోరు రసవత్తరంగా సాగే అవకాశం ఉంది. స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడమే తరువాయి పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నట్లు చెబుతున్నారు. స్థానిక సంస్థలకు షెడ్యూల్ ప్రకారం ఎన్నికలు నిర్వహించాలని వివిధ పార్టీల నాయకులు కోరుతున్నారు. ప్రత్యేకాధికారుల పాలనలో ప్రజలు ఇబ్బందులు పడుతారని వీలైనంత త్వరగా ఎన్నికలు నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

నమో జగన్నాథా..

నగర వ్యాప్తంగా ఆదివారం జగన్నాథ రథయాత్ర ఉత్సవాలు నేత్రపర్వంగా జరిగాయి. ప్రధానంగా సికింద్రాబాద్ ఎస్పీ రోడ్‌లోని ఇస్కాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జగన్నాథ స్వామి రథయాత్ర ఆద్యంతం ఆధ్యాత్మికతను సంతరించుకుంది. భక్తుల పూజలు, హారతుల మధ్య యాత్ర శోభాయమానంగా సాగింది. భక్తుల కోలాహలం మధ్య రథయాత్ర సెయింట్ మేరీస్ రోడ్, ప్యాట్నీ సెంటర్, ఆర్పీరోడ్, మోండా మార్కెట్, క్లాక్ టవర్, సంగీత్ చౌరస్తా మీదుగా ఇస్కాన్ టెంపుల్‌కు చేరుకుంది.



పుష్కరమైనా పత్తాలేవు!

- 2012 నుంచి అమలుకు నోచుకోని హెచ్‌ఓపీలు
- ‘గ్రేటర్’ పరిధిలో ఎనిమిదింటికి ప్రతిపాదనలు
- పట్టనట్లుగా వ్యవహరిస్తున్న ప్రభుత్వ విభాగాలు

సాక్షి, సిటీబ్యూరో: ఏదైనా ఓ సమస్యకు కారణం తెలిస్తేనే దాన్ని పరిష్కరించడంతో పాటు పునరావృతం కాకుండా చూసే ఆస్కారం ఉంటుంది. ఏటా వందల మందిని కబళిస్తున్న రోడ్డు ప్రమాదాల విషయంలోనూ ఇది వర్తిస్తుంది. ‘గ్రేటర్’ రోడ్లు రక్తమోడుతూనే ఉన్నాయి. రాకాసి రహదారి ఓఆర్‌ఆర్‌తో పాటు అంతర్గత మార్గాలూ నిత్యం రుధిర దారులే అవుతున్నాయి. ఏదో ఒక ఇంట విషాదాన్ని నింపుతున్నాయి. వీటికి చెక్ చెప్పేందుకు ప్రమాదాలకు కారణాలను పరిశోధించడం కీలకమని భావించిన యంత్రాంగాలు 2012లో బ్యూరో ఆఫ్ రోడ్ సేఫ్టీ అండ్ ట్రాఫిక్ ప్లానింగ్‌కు (బీఆర్‌ఎస్ అండ్ టీపీ) అంకురార్పణ చేశాయి. ఇందులో భాగంగా రోడ్డు ప్రమాదాలపై పరిశోధనకు మూడు కమిషనరేట్ల పరిధిలో ఎనిమిది ఔట్ పోస్టులు ఏర్పాటు చేయాలని భావించారు. పుష్కరకాలం అవుతున్నా ఈ ప్రతిపాదన ఇప్పటికీ కాగితాలకే పరిమితమైంది.

సిటీలో ప్రమాదాలు, మృతులు ఇలా..

ఏడాది	ప్రమాదాలు	మృతులు	క్షతగాత్రులు
2021	2,575	323	2,252
2022	2,106	275	1,831
2023	2,548	335	2,090

కారణాలు ‘కనిపించని’ రోడ్డు ప్రమాదాలు



ఇప్పుడంతా నామ్‌కే వాస్తేనే..

నగరం లేదా శివార్లలో, ఓఆర్‌ఆర్ పైనా ఓ ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంటే దానిపై కేసు నమోదు చేసుకుంటున్న స్థానిక పోలీసులు రొటీన్ పద్ధతిలో దర్యాప్తు చేపట్టి ఎవరి పొరపాటుతో ప్రమాదం జరిగిందనేది తేల్చేస్తున్నారు. ప్రమాదంలో ఇన్‌వాల్వ్ అయి ఉన్న వాటిలో ఏది పెద్ద వాహనమైతే వారి నిర్లక్ష్యం కారణంగానే ఉదంతం చోటు చేసుకుందంటూ రికార్డుల్లోకి ఎక్కించడం పరిపాటిగా మారింది. ఏ స్థాయిలోనూ కూడా ప్రమాద కారణాలు విశ్లేషించే, నిరోధాలను తెలిపే సమగ్ర అధ్యయనం జరగట్లేదు. కనీసం జాతీయ రహదారులపై చోటు చేసుకున్న ప్రమాదాలపైనా సమగ్ర అధ్యయనం చేయాలని 2012లో రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ప్రమాదానికి గల కారణాలు, రోడ్డు మౌలిక స్థితిగతులు, చేపట్టాల్సిన మార్పు చేర్పులను అధ్యయనం చేసేందుకే బీఆర్‌ఎస్ అండ్ టీపీని ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది.

హత్యల కన్నా ప్రమాదకరంగా..

ప్రతి ఏడాదీ జంట నగరాల్లో చోటు చేసుకుంటున్న హత్యల్లో కన్నుమూస్తున్న వారి కన్నా.. రోడ్డు ప్రమాదాల బారినపడి అసువులు బాస్తున్న వారి సంఖ్య రెట్టింపు వరకు ఉంటోంది. గత ఏడాది నగరంలో హత్య కేసుల్లో మృతుల సంఖ్య 65గా ఉంటే.. రోడ్డు ప్రమాదాల్లో మరణించిన వారి సంఖ్య 335గా ఉంది. రాష్ట్రంలో నమోదవుతున్న ప్రమాదాల్లో సగానికి పైగా హైదరాబాద్, సైబరాబాద్, రాచకొండల్లోనే ఉంటున్నాయి. ఈ ప్రమాదాల్లో ‘గ్రేటర్’ మీదుగా వెళ్తున్న జాతీయ రహదారులపై జరుగుతున్నవే ఎక్కువ. వీటికి చెక్ చెప్పేందుకు ఉద్దేశించినదే బీఆర్‌ఎస్ అండ్ టీపీ. డీజీపీ కార్యాలయం కేంద్రంగా అదనపు డీజీపీ నేతృత్వంలో ఏర్పాటు కావాల్సి ఉంది. ఈ విభాగం రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేయనున్న హైవే పెట్రోలింగ్ ఔట్ పోస్టు (హెచ్‌ఓపీ)ల్లో ఎనిమిది రాజధానిలోని మూడు కమిషనరేట్లలోనే (అప్పట్లో రెండే కమిషనరేట్లు) పెట్టాలనుకున్నారు.

కాగితాలకే పరిమితమైన లక్ష్యాలు..

ఈ విభాగాన్ని ప్రధానంగా మూడు లక్ష్యాల కోసం పని చేయిస్తున్నట్లు ప్రభుత్వం ఘనంగా ప్రకటించింది. వీటిని ‘త్రీ ఆర్స్’గానూ నిర్దేశించారు. అంటే.. రెడ్యూస్ ది ఫాటల్ యాక్సిడెంట్స్ (ప్రాణాంతకమైన ప్రమాదాల తగ్గింపు), రెడ్యూస్ క్యాజువాల్టీస్ ఇన్ రోడ్ యాక్సిడెంట్స్ (రోడ్డు ప్రమాదాల్లో మృతుల సంఖ్య తగ్గించడం), రెడ్యూస్ ట్రావెల్ టైమ్ ఆన్ రోడ్ ఇన్ అర్బన్ ఏరియాస్ (నగర/పట్టణ ప్రాంతాల్లో రోడ్డుపై ప్రయాణ సమయం తగ్గించడం). ఈ మూడూ కూడా మూడు కమిషనరేట్లకు కీలకమైనవే. వీటిని సాధించడం కోసం బీఆర్‌ఎస్ అండ్ టీపీ ఇంజినీరింగ్, ఎడ్యుకేషన్, ఎన్‌ఫోర్స్‌మెంట్, ఎమర్జెన్సీ సర్వీసెస్, ఎన్‌క్యాచ్‌మెంట్ అండ్ లీగల్ సర్వీసెస్, ఎకనమిక్ రిలీఫ్ అనే ‘సిక్స్ ఈస్’ను నిర్వహిస్తుందని అప్పట్లోనే ప్రకటించారు. ఈ లక్ష్యాలన్నీ కాగితాలకు, ఫైళ్లకు మాత్రమే పరిమితమయ్యాయి.

ప్రభుత్వానికీ సలహాలు ఇప్పించాలని..

మౌలిక వసతుల కల్పన, అభివృద్ధిలో కీలకమైన ఇంజినీరింగ్‌లో భాగంగా బీఆర్‌ఎస్ అండ్ టీపీ ద్వారా రోడ్ సేఫ్టీ పాలసీలను సమగ్రంగా, లోతుగా అధ్యయనం చేయించాలని భావించారు. వీటిలో మార్పుచేర్పులు అవసరమైనట్లు గుర్తించడంతో పాటు ఆ మేరకు సాక్షాత్తూ ప్రభుత్వానికే దీంతో సలహాలు ఇప్పిచాలనుకున్నారు. రోడ్ల స్థితిగతులు, ప్రమాదాలు జరగడానికి కారణాలు, నివారణ మార్గాలు తదితర కీలక అంశాలు వీటిలో ఉండాల్సి ఉంది. దీన్ని సాధించడంలో భాగంగా ఇదే ఆశయం కోసం పని చేస్తున్న రోడ్ సేఫ్టీ కౌన్సిల్స్, రోడ్ సేఫ్టీ అథారిటీస్, ఆర్ అండ్ బీ, ఆర్టీఏ, కేంద్ర ప్రభుత్వ అధీనంలోని మినిస్ట్రీ ఆఫ్ సర్ఫేస్ ట్రాన్స్‌పోర్ట్, మినిస్ట్రీ ఆఫ్ అర్బన్ డెవలప్‌మెంట్, మినిస్ట్రీ ఆఫ్ హ్యూమన్ రిసోర్సెస్ డెవలప్‌మెంట్ తదితర విభాగాలతో సమన్వయంతో పని చేయించాలంటూ ఉన్నతాశయాన్ని ఏర్పరుచుకున్నారు. ఇప్పటికీ ఈ ప్రతిపాదనలకు మోక్షం లభించలేదు.

బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవం

నేటి నుంచి మూడ్రోజులు ట్రాఫిక్ ఆంక్షలు

సనత్‌నగర్: బల్కంపేట ఎల్లమ్మ కల్యాణోత్సవం సందర్భంగా నేటి నుంచి మూడు రోజుల పాటు ట్రాఫిక్ ఆంక్షలు విధించినట్లు పోలీసులు తెలిపారు. కల్యాణం జరిగే 9న, రథోత్సవం నిర్వహించే 10న భక్తులు విశేషంగా తరలిరానున్న నేపథ్యంలో ఈ నెల 8 నుంచి 10 వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలులో ఉంటాయని పేర్కొన్నారు. వాహనదారులు, ప్రయాణికులు గమనించి ప్రత్యామ్నాయ మార్గాల్లో వెళ్లాల్సిందిగా సూచించారు. ట్రాఫిక్ ఆంక్షలు ఇలా ఉన్నాయి.

- గ్రీన్‌ల్యాండ్స్, మాతా టెంపుల్, సత్యం థియేటర్ నుంచి ఫతేనగర్ వైపు వెళ్లే ట్రాఫిక్‌ను ఎస్‌ఆర్‌నగర్ టి-జంక్షన్ వద్ద మళ్లించి ఎస్‌ఆర్‌నగర్ కమ్యూనిటీ హాల్, అభిలాష టవర్స్, బీకేగూడ ఎక్స్‌రోడ్డు, శ్రీరామ్‌నగర్ క్రాస్‌రోడ్డు, సనత్‌నగర్ మీదుగా ఫతేనగర్ రోడ్డు వైపు అనుమతిస్తారు.
- ఫతేనగర్ ఫ్లైఓవర్ నుంచి బల్కంపేట వైపు వెళ్లే వాహనాలను కొత్త వంతెన వద్ద కట్టమైసమ్మ దేవాలయం, బేగంపేట వైపు మళ్లిస్తారు.
- గ్రీన్‌ల్యాండ్స్-బకుల్ అపార్ట్‌మెంట్స్, ఫుడ్‌వరల్డ్ నుంచి వచ్చే వాహనాలను బల్కంపేట వైపు అనుమతించరు. ఫుడ్‌వరల్డ్ ఎక్స్‌రోడ్డులో సోనాబాయి టెంపుల్, సత్యం థియేటర్, మైత్రివనం లేదా ఎస్‌ఆర్‌నగర్ టి-జంక్షన్ వైపు మళ్లిస్తారు.
- బేగంపేట కట్టమైసమ్మ దేవాలయం నుంచి వచ్చే వాహనాలు బల్కంపేట వైపు వెళ్లడానికి అనుమతించరు. ఆ ట్రాఫిక్‌ను గ్రీన్‌ల్యాండ్స్, మాతా ఆలయం, సత్యం థియేటర్, ఎస్‌ఆర్‌నగర్ టి-జంక్షన్ ఎడమ మలుపు నుంచి ఎస్‌ఆర్‌నగర్ కమ్యూనిటీ హాల్ వైపు మళ్లిస్తారు.
- ఎస్‌ఆర్‌నగర్ టీ-జంక్షన్ నుంచి ఫతేనగర్ వరకు బైలేన్లతో పాటు లింక్ రోడ్లు మూసివేస్తారు.

వాహనాల పార్కింగ్ ఇలా..

ఎస్‌ఆర్‌నగర్ టీ-జంక్షన్ సమీపంలో ఆర్‌అండ్‌బీ కార్యాలయం, ఫుడ్‌వరల్డ్ ఎక్స్‌రోడ్డు సమీపంలోని జీహెచ్‌ఎంసీ గ్రౌండ్, నేచర్‌క్యూర్ హాస్పిటల్ రోడ్డు సైడ్ పార్కింగ్, నేచర్‌క్యూర్ హాస్పిటల్ పార్కింగ్, ఫతేనగర్ రైల్వే వంతెన కింద పార్కింగ్ ప్రాంతాలను గుర్తించారు. భక్తులు తమ వాహనాలను నిర్ణీత పార్కింగ్ ప్రదేశాల్లో మాత్రమే సక్రమంగా పార్కింగ్ చేయాలని ట్రాఫిక్ పోలీసులు సూచించారు. ఏదైనా అత్యవసర పరిస్థితుల్లో, ప్రయాణ సహాయం కోసం ట్రాఫిక్ హెల్ప్‌లైన్ 90102 03626కు ఫోన్ చేయాలన్నారు.

పెట్టుబడులు పెట్టండి..



బ్రోచర్ ఆవిష్కరిస్తున్న స్పీకర్ ప్రసాద్‌కుమార్, ఎమ్మెల్యే యాదయ్య తదితరులు

అభివృద్ధికి సహకరించండి

- స్పీకర్ ప్రసాద్ కుమార్

శంకర్‌పల్లి: పెట్టుబడి దారులు వికారాబాద్ వైపు దృష్టి సారించి, అభివృద్ధికి సహకరించాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. ఆదివారం ఆయన ఎమ్మెల్యే కాలే యాదయ్యతో కలిసి శంకర్‌పల్లి మండలం చెందిప్ప గ్రామంలో వివాంట బ్రోచర్‌ను ఆవిష్కరించారు. అనంతరం స్పీకర్ మాట్లాడారు. వివాంట ఎండీ శ్రీనివాస్ రావు అనేక సామాజిక కార్యక్రమాలు చేపడుతుంటారని, వారు చేసే ప్రాజెక్టులు సైతం ప్రభుత్వ విధివిధానాలకు లోబడి ఉంటాయని తెలిపారు. ఇదిలా ఉండగా.. రాబోయే ఐదేళ్లలో వికారాబాద్ అద్భుతమైన ప్రగతి సాధించనున్నట్లు స్పీకర్ స్పష్టం చేశారు. అనంతరం ఎమ్మెల్యే కాలే మాట్లాడుతూ.. శంకర్‌పల్లి పట్టణం హైదరాబాద్ మహానగరానికి చేరువలో ఉందని, భవిష్యత్తులో మరింత అభివృద్ధి చెందుతుందని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు బొక్క నర్సింహారెడ్డి, రాష్ట్ర కాలుష్య బోర్డు సభ్యుడు సత్యనారాయణరెడ్డి, కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల ఇన్‌చార్జి భీంభరత్, రాష్ట్ర అధికార ప్రతినిధి సత్యం శ్రీరంగం నాయకులు, తొండ రవి, ఉదయ్‌మోహన్‌రెడ్డి, దేవ్లా నాయక్, జనార్దన్‌రెడ్డి, మోహన్‌రెడ్డి, పలువురు బిల్డర్లు తదితరులు పాల్గొన్నారు.

బైక్‌ను ఢీకొన్న టిప్పర్

మహిళ మృతి

దుండిగల్: వెనుక నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ ద్విచక్రవాహనాన్ని ఢీకొట్టడంతో టిప్పర్ టైర్ల కింద పడి ఓ మహిళ మృతి చెందింది. ఈ ఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. ఐడీఏ బొల్లారం ప్రాంతానికి చెందిన భూమయ్య, నాగమణి(38)లు భార్యాభర్తలు. శనివారం సాయంత్రం ఇద్దరూ యాక్టీవాపై నర్సాపూర్ నుంచి గండిమైసమ్మ వైపు వస్తున్నారు. ఖాజీ పల్లి చౌరస్తా దాటిన తరువాత టీటైమ్ హోటల్ సమీపంలో వెనుక నుంచి వేగంగా వచ్చిన టిప్పర్ భూమయ్య, నాగమణిలు ప్రయాణిస్తున్న బైక్‌ను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో రోడ్డుపై పడిన నాగమణి మీదుగా టిప్పర్ వెళ్లడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందగా, భూమయ్య గాయాలతో బయటపడ్డాడు. మృతురాలి భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

ఉప్పల్: ఆర్థిక ఇబ్బందులు తాళ లేక ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన ఉప్పల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. రామంతాపూర్ గృహకల్ప ప్రాంతానికి చెందిన జోషి రవికుమార్(40) కియా మోటర్స్‌లో పని చేస్తున్నాడు. శనివారం విధులు ముగించుకుని ఇంటికి వచ్చి ఆకలిగా ఉంది వంట చేయాలని భార్య నిషా జోషికి చెప్పాడు. దీంతో ఆమె వంట చేయడంలో నిమగ్నమయింది. రవికుమార్ బెడ్ రూంలోకి వెళ్లి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. భార్య తలుపు కొట్టినా ఎంతకూ తీయకపోవడంతో పక్కంటికి వెళ్లి కిటికిలోంచి చూడగా ఫ్యాన్‌కు ఉరి వేసుకుని వేలాడుతున్నాడు. తలుపు పగలగొట్టి రవికుమార్‌ను దించి, చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా అప్పటికే కుమార్ మృతి చెందినట్లు డాక్టర్లు ధ్రువీకరించారు. దీంతో భార్య నిషా జోషి ఉప్పల్ ఠాణలో ఫిర్యాదు చేసింది. ఆర్థిక సమస్యలతో బలవన్మరణానికి పాల్పడినట్లు పేర్కొంది. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

సబ్సిడీ పథకాలకు మంగళం!

- రాయితీపై అందని వ్యవసాయ పరికరాలు, విత్తనాలు
- విడుదల కాని నిధులు, వెలువడని మార్గదర్శకాలు
- ఆందోళన వ్యక్తంచేస్తున్న రైతులు
- సాగు భారమైందంటున్న ఆవేదన

షాబాద్: వ్యవసాయ పనుల్లో యంత్రాల పాత్ర నానాటికీ పెరుగుతూనే ఉంది. తక్కువ సమయంలో సాగు పనులు చేయడానికి వాటిని వాడేందుకు రైతులు మక్కువ చూపుతున్నారు. దున్నడం, విత్తనాలు వేయడం, కలుపు తీయడం, పిచికారీ, కోతలు కోయడం వంటి పనులన్నింటికి యంత్రాలనే వినియోగిస్తున్నారు. అయితే గతంలో వ్యవసాయ పరికరాలు, యంత్రాలు తదితర వాటిని ప్రభుత్వం రాయితీపై అందించేది. కానీ క్రమంగా సబ్సిడీకి సర్కారు మంగళం పాడుతూ వస్తుండటంతో అది రైతులకు భారంగా మారింది. అయినా సరే యంత్రాల వాడకం పెరుగుతున్నప్పటికీ.. మోయలేని భారంగా మారుతుందంటూ రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.



మరియాపురంలో పత్తి పంటకు ట్రాక్టర్‌తో పురుగు నివారణ మందు పిచికారీ



విత్తనాలు వేస్తున్న రైతులు

ప్రోత్సహించండి..

వ్యవసాయశాఖ ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న సబ్సిడీ పథకాలు అటకెక్కాయి. ఏళ్లుగా ఈ స్కీంలకు సంబంధించి నిధులు మంజూరు కావడం లేదు. గతంలో వ్యవసాయ యాంత్రీకరణ, జాతీయ ఆహార భద్రత కమిషన్ (ఎన్‌ఎఫ్‌ఎస్‌ఎం) ఆర్‌కేవీవై (రాష్ట్రీయ కృషి వికాస్ యోజన) తదితర పథకాలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసేవి. రాయితీపై సాగు యంత్రాలు ట్రాక్టర్లు, మినీ ట్రాక్టర్లు, రోటవేటర్లు, కల్టివేటర్లు, పొలం దున్నే పనిముట్లు, టార్పాలిన్లు అందించేవి. కానీ గత ప్రభుత్వం వీటికి ఎలాంటి బడ్జెట్ కేటాయించలేదు. కొత్త ప్రభుత్వం నుంచి కూడా వ్యవసాయ యాంత్రీకరణకు సంబంధించి ఎలాంటి గైడ్‌లైన్స్ వ్యవసాయ శాఖకు ఇప్పటి వరకు రాకపోవడంతో శోచనీయం. తిరిగి సాగు యాంత్రికరణకు సంబంధించిన అన్ని పథకాలను అమలు చేసి, సాగుని ప్రోత్సహించాలని రైతులు కోరుతున్నారు.

విత్తనాలపై కోత

ఏటా వ్యవసాయశాఖ ద్వారా రైతులకు రాయితీపై కందులు, పెసర, మినుము, వేరుశనగ తదితర విత్తనాలను పంపిణీ చేసేది. కానీ ప్రస్తుత వానాకాలం సీజన్‌లో జనములు, సోయాబీన్ విత్తనాలను మాత్రమే పంపిణీ చేసి ప్రభుత్వం చేతులు దులుపుకొందని రైతులు ఆరోపిస్తున్నారు.

తీవ్ర ప్రభావం

జిల్లాలో మొత్తం 7లక్షల 80 వేల ఎకరాల సాగు భూమి ఉందని, 7లక్షల 2,789 ఎకరాల్లో పంటలు సాగు అవుతున్నట్లు వ్యవసాయ అధికారుల ద్వారా తెలుస్తోంది. ఎక్కువగా పత్తి, వరి, కంది, వివిధ రకాల పండ్ల తోటలను రైతులు సాగు చేస్తుంటారు. అయితే సబ్సిడీ అందక సాగు విస్తీర్ణం నానాటికీ తగ్గిపోతుందని అన్నదాతలు ఆందోళన చెందుతున్నారు.

బహుళ ప్రయోజనాలు

గ్రామీణ ప్రాంతాల్లో ఎక్కువగా ట్రాక్టర్లతో పొలాలు దున్నుతుంటారు. ఇలా చేయడం వలన ఇదివరకు సాగు చేసిన పంటల అవశేషాలు, తెగుళ్ల ఆనవాళ్లు భూమిలో లేకుండా పోతాయి. నాగళ్లు, కల్టివేటర్, రోటవేటర్లతో భూమిని దున్నడం ద్వారా మట్టి గడ్డలను పగుల గొట్టడం చదును చేయడం, బోదెలు తీసేయవచ్చు. వీటి వాడకంతో సమయం ఆదా అవుతుంది.

ఎదురు చూస్తున్నా..



నాకు 5 ఎకరాల భూమి ఉంది. రాయితీ ట్రాక్టర్ కోసం సంబంధిత అధికారుల చుట్టూ తిరుగుతున్న. నిధులు లేవని చెబుతున్నారు. ప్రతి సారి కిరాయి ట్రాక్టర్లతో దుక్కి దున్నించడంతో పెట్టుబడి పెరిగి పోతోంది. ప్రభుత్వం సబ్సిడీపై ఇచ్చే ట్రాక్టర్ కోసం ఎదురు చూస్తున్న.

– గంగిడి భూపాల్‌రెడ్డి, రైతు, హైతాబాద్, షాబాద్

నిధులు మంజూరు కాలేదు



రాష్ట్ర ప్రభుత్వం నుంచి సబ్సిడీ పథకాలకు సంబంధించి ఎలాంటి నిధులు విడుదల కాలేదు. మార్గదర్శకాలు ఇవ్వలేదు. నిధులు మంజూరు కాగానే.. రాయితీ పథకాలను రైతులకు అందజేస్తాం.

– గీతారెడ్డి, జిల్లా వ్యవసాయాధికారి

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



యాదగిరి(ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: అనుమానాస్పద స్థితిలో షాద్‌నగర్ వాసి నాగర్ కర్నూల్ జిల్లాలో మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం.. ఫరూఖ్‌నగర్ మండల పరిధి వెలిజర్ల గ్రామానికి చెందిన దొడ్డి యాదగిరి(38) గ్రామంలో ఫొటో స్టూడియో నిర్వహిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. యాదగిరికి కొంత కాలంగా మానసిక వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ నెల 2న కుటుంబ సభ్యులతో కలిసి మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట మండలం ఫతేపూర్ మైసమ్మ దేవాలయానికి వచ్చారు. 4న తన బావతో దేవునిపడకల్ వెళ్లాడు. మరుసటి రోజు ఎవరికి చెప్పకుండా అచ్చంపేటకు వెళ్లాడు. దీంతో అతని కోసం కుటుంబ సభ్యులు బంధువులు, తెలిసిన వారి ఇళ్లలో వెతికినా ఫలితం కనిపించలేదు. ఈ క్రమంలో నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలం పోలిశెట్టిపల్లి గ్రామశివారులో గుర్తు తెలియని వ్యక్తి చెట్టుకు ఉరి వేసుకొని మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బల్మూర్ పోలీసులు ఘటనా స్థలాన్ని సందర్శించి, మృతుడు యాదగిరిగా గుర్తించారు. కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకువచ్చారు. మృతుడికి భార్య, ఇద్దరు కొడుకులు, ఒక కూతురు ఉన్నారు.

జూదరుల అరెస్టు

ఇబ్రహీంపట్నం రూరల్: మార్కెట్ యార్డు గోదాంలో జూదం ఆడుతున్న పలువురిని ఎస్‌ఓటీ పోలీసులు ఆదివారం పట్టుకున్నారు. సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో గోదాంను అద్దెకు తీసుకొని కొందరు పేకాట ఆడుతున్నారు. విశ్వసనీయ సమాచారం మేరకు మహేశ్వరం జోన్ ఎస్‌ఓటీ, పట్నం పోలీసులు సంయుక్తంగా గిడ్డంగిపై దాడి చేశారు. ఈ దాడిలో గోదాం నిర్వాహకులు కర్రె సిద్దప్ప, ముత్యాల కృష్ణ, భర్తల శంకర్, ఆకుల రాజు, గాజుల గోపాల్ పట్టుబడ్డారు. వీరి నుంచి రూ.12,830 నగదు, 5 సెల్‌ఫోన్లు, సెట్ కార్డులు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకొని రిమాండ్‌కు తరలించనున్నట్లు సీఐ తెలిపారు.

మాల్‌లో బెల్లం పట్టివేత

యాచారం: నాగార్జునసాగర్–హైదరాబాద్ రహదారిపై మాల్ మార్కెట్ సమీపంలో ఆదివారం 120 కిలోల బెల్లాన్ని పోలీసులు పట్టుకున్నారు. వివరాలు ఇలా ఉన్నాయి.. గుర్తు తెలియని వ్యక్తి కారులో హైదరాబాద్ నుంచి మాల్‌కు బెల్లాన్ని తరలిస్తున్నాడు. ఈ క్రమంలో మాల్ సమీపంలో వేగంగా వెళ్తున్న కారు పల్టీకొట్టింది. ఈ ప్రమాదంలో గాయపడిన డ్రైవర్ పారిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించగా.. కారులో బెల్లం ఉన్నట్లు గుర్తించారు. బెల్లాన్ని స్వాధీనం చేసుకుని, కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు.

మెల్‌బోర్న్‌లో బోనాల సంబరాలు



బోనాల వేడుకలో పాల్గొన్న పోల్కంపల్లి యువకులు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆషాఢ మాసం బోనాల సంబురాలు ప్రారంభమయ్యాయి. దేశంతో పాటు ఆస్ట్రేలియాలో ప్రవాస భారతీయులు తెలంగాణ సంస్కృతీ సంప్రదాయాలను ఘనంగా జరుపుకొంటారు. గ్రామదేవతలకు బోనాలు సమర్పించి, తొట్టెలను ఊరేగిస్తారు. మెల్‌బోర్న్‌లో ఇబ్రహీంపట్నం మండలం పోల్కంపల్లి గ్రామానికి చెందిన కొమ్మిడి సంతోష్‌రెడ్డి ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలను నిర్వహించారు. వీరితో పాటు పట్నం మండల ప్రవాస భారతీయులు బొడ్డు రవీందర్‌రెడ్డి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

విమానాశ్రయంలో నగలు మాయం

శంషాబాద్: శంషాబాద్ విమానాశ్రయంలో నగలు మాయమయ్యాయని ఓ మహిళ ఆర్‌జీఐఏ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈసీఐఏఎల్‌కు చెందిన ఓ మహిళ భర్తతో కలిసి లండన్ నుంచి ఆదివారం ఉదయం శంషాబాద్ ఎయిర్‌పోర్టుకు చేరుకుంది. బయటికి వచ్చిన సమయంలో బ్యాగులో ఉన్న ఏడు తులాల నగలు కనిపించకపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేసింది.

చెరువులో దూకి వ్యక్తి ఆత్మహత్యాయత్నం

నిజాంపేట్: కుటుంబ కలహాల నేపథ్యంలో చెరువులోకి దూకి ఆత్మహత్యకు యత్నించిన ఓ వ్యక్తిని బాచుపల్లి పోలీసులు కాపాడారు. పోలీసులు తెలిపిన మేరకు.. బాచుపల్లి రాజీవ్‌గాంధీనగర్‌కు చెందిన డ్రైవర్ నరేష్ (23), రాణిలు భార్యాభర్తలు. ఆదివారం ఉదయం భార్యతో గొడవ పడిన నరేష్ కోపంతో స్థానికంగా ఉన్న భైరుని చెరువులోకి దూకి ఆత్మహత్యకు యత్నించాడు. ఈ విషయమై సమాచారం అందుకున్న కానిస్టేబుల్ సత్యపాల్‌రెడ్డి వెంటనే చెరువు వద్దకు చేరుకుని నరేష్‌ను ప్రాణాలతో కాపాడాడు. భార్యాభర్తలిద్దరిని స్టేషన్‌కు పిలిపించి కౌన్సిలింగ్ ఇచ్చి ఇంటికి పంపించారు.

నమ్మించి.. మోసగించిన హెచ్‌ఎండీఏ!



సమావేశంలో మాట్లాడుతున్న ప్లాట్ల కొనుగోలుదారులు

- ప్లాట్లు విక్రయించి.. అభివృద్ధి మరిచిన అధికారులు
- రుణాలు తెచ్చి స్థలాలు కొన్నాం
- అప్పులు కట్టలేక మానసిక క్షోభ అనుభవిస్తున్నాం
- తొర్రూర్ లే అవుట్ ప్లాట్ల కొనుగోలుదారుల ఆవేదన

తుర్కయంజాల్/హయత్‌నగర్: 'హైదరాబాద్ మహానగర అభివృద్ధి సంస్థ (హెచ్‌ఎండీఏ) లే అవుట్ అన్న నమ్మకంతో రూ.కోట్లు పోసి ప్లాట్లను వేలంలో పోటీ పడి కొనుగోలు చేశాం. ప్రభుత్వం ప్లాట్లను విక్రయించిందే కానీ.. నిబంధనల ప్రకారం మేము కొన్న స్థలాల(లే అవుట్)ను అభివృద్ధి చేయకుండా.. రెండున్నర సంవత్సరాలుగా ఇబ్బందులకు గురిచేస్తోంది. నమ్మించి మోసం చేసింది' అని నివాస స్థలాల కొనుగోలు దారులు ఆవేదన వ్యక్తంచేస్తున్నారు. జవాబుదారీతనం లేని అధికారుల నిర్లక్ష్యం కారణంగా స్థలం కొన్నవారు నష్టపోతున్నారని రాక్‌హిల్స్ కౌంటి వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు కొండ్రు పురుషోత్తం ఆరోపించారు. ఆదివారం తొర్రూర్‌లో నిర్వహించిన సమావేశంలో ప్లాట్ల కొనుగోలు దారులు మాట్లాడారు. అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తొర్రూర్ గ్రామంలోని సర్వే నంబర్ 383/1లో 2022 నవంబర్‌లో నగర అభివృద్ధి సంస్థ అధికారులు లే అవుట్ చేశారని తెలిపారు. ఈ వేలం ద్వారా 392 ప్లాట్లను విక్రయించి రూ.500 కోట్లను గడించిందని పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం 18 నెలల లోపు మౌలిక వసతులైన రోడ్డు, తాగునీరు, విద్యుత్, డ్రైనేజీ వంటి వాటిని కల్పించాల్సి ఉంటుంది. కానీ 28 నెలలు గడిచినా ఎలాంటి పురోగతి లేదని విమర్శించారు.

విన్నవించినా.. వినడం లేదు

ఇదే విషయమై హెచ్‌ఎండీఏ ఎస్టేట్ అధికారి వీరారెడ్డి, ప్లానింగ్ డైరెక్టర్ కె.శ్రీనివాస్, చీఫ్ ఇంజినీర్ పరంజ్యోతిని కలిసి పలుమార్లు వినతిపత్రం అందజేసినా ఫలితం లేదని కొనుగోలు దారులు ఆరోపించారు. ఈ ఏడాది జూన్ 15వ తేదీ నాటికి పనులు పూర్తి కావాల్సి ఉన్నా.. అవి నత్తనడకన కొనసాగుతున్నాయన్నారు. బ్యాంకుల ద్వారా రుణాలు పొంది, ప్లాట్లు కొని తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, సకాలంలో పనులు పూర్తి కాకపోవడంతో అధిక వడ్డీ చెల్లించలేక మానసిక క్షోభ అనుభవిస్తున్నామని వాపోయారు.

ప్రజా ప్రయోజన స్థలాలపై కబ్జాకోరుల నజర్

అధికారుల అలసత్వం కారణంగా వెంచర్‌లో ప్రజా ప్రయోజనార్థం వదిలిన స్థలాలపై ఆక్రమణ దారుల కళ్లు పడ్డాయని, వాటిని అన్యాక్రాంతం చేసే ప్రయత్నం చేస్తున్నా.. ఎవరూ పట్టించుకోవటం లేదని పలువురు ఆరోపించారు. నెలలు గడుస్తున్నా ప్రభుత్వం, హెచ్‌ఎండీఏ స్పందించకపోవడంతో కోర్టును ఆశ్రయించామని తెలిపారు. న్యాయస్థానం ఆదేశాల ప్రకారం మరో 2 నెలల్లో పనులు పూర్తి కావాల్సి ఉన్నప్పటికీ, ఇక్కడ నిర్లక్ష్యమే రాజ్యమేలుతుందని మండిపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దీనిపై స్పందించి, వెంటనే పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని ప్లాట్ల కొనుగోలుదారులు కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి అనిల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎక్సైజ్ శాఖ విస్తృత దాడులు

బెల్లం పానకం ధ్వంసం

- పలు కేసులు నమోదు



నాటు సారా తయారీ సామగ్రితో పట్టుబడిన వ్యక్తి

కడ్తాల్: గుడుంబా రహిత తెలంగాణే లక్ష్యంగా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖల ఆధ్వర్యంలో దాడులు చేసినట్లు ఎక్సైజ్ సీఐ బద్యానాథ్ చౌహాన్ తెలిపారు. గుడుంబా తయారు చేస్తున్నారనే విశ్వసనీయ సమాచారం మేరకు ఆదివారం, కడ్తాల్, మాడ్గుల్, ఆమనగల్లు, తలకొండపల్లి మండలాల పరిధి పలు గ్రామాలు, తండాల్లో ముమ్మరంగా దాడులు నిర్వహించినట్లు సీఐ వెల్లడించారు. ఇందులో భాగంగా కడ్తాల్ మండలం రావిచేడ్ గ్రామ సమీపంలోని గుట్టలో నిల్వ ఉంచిన 400 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశామన్నారు. ఒకరిని అరెస్ట్ చేయగా.. మరో వ్యక్తి పరారయ్యాడని ఆయన వెల్లడించారు. ఇరువురి వద్ద 12 లీటర్ల సారాను స్వాధీనం చేసుకుని సీజ్ చేశామని, 4 కేసులు నమోదు చేశామని వివరించారు. నిషేధించిన నాటు సారా తయారు చేసినా, విక్రయించినా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ అరుణ్‌కుమార్, హెడ్ కానిస్టేబుల్ శంకర్, కానిస్టేబుల్స్ నర్సింహ, ఆమని, బాబు, ప్రవీణ్‌రెడ్డి, ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది తదితరులు ఉన్నారు.

చాక్లెట్ ఇప్పిస్తానని పిలిచి..

- బాలికపై లైంగిక దాడి
- నిందితుడిపై పోక్సో కేసు నమోదు

ఇబ్రహీంపట్నం రూరల్: ఆరుబయట ఆడుకుంటున్న బాలికను చాక్లెట్ ఇప్పిస్తానని పిలిచి ఇంట్లోకి తీసుకెళ్లి లైంగిక దాడికి పాల్పడిన అమానుష సంఘటన ఇబ్రహీంపట్నం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ సత్యనారాయణ కథనం ప్రకారం.. ఇబ్రహీంపట్నం మండలం తులేకలాన్ గ్రామానికి చెందిన బోడ నర్సింహ (50) కూలి పని చేస్తుండేవాడు. అదే గ్రామానికి చెందిన బాలిక (8) ఆదివారం ఆరుబయట ఆడుకుంటోంది. చిన్నారికి పది రూపాయల నోటు ఇచ్చి చాక్లెట్ ఇప్పిస్తానని ఎత్తుకొని ఇంట్లోకి తీసుకెళ్లాడు. ఆమెపై లైంగిక దాడికి పాల్పడగా చిన్నారికి రక్తస్రావం కావడంతో కేకలు వేసింది. విషయం తల్లికి తెలియడంతో పోలీసులకు సమాచారం అందించారు. ఈ మేరకు నర్సింహను అరెస్టు చేసి, పోక్సోచట్టం కింద కేసు నమోదు చేశారు. బాలికను ఆస్పత్రిలో చేర్పించి చికిత్స చేయిస్తున్నారు.